క్లుప్తంగా

220మందికి ఉచిత వైద్యసేవలు



అడ్డురోడ్డు ప్రజా వైద్య శాలలో చికిత్స అందిస్తున్న వైద్యుడు బంగారయ్య

ఎస్.రాయవరం : ప్రభుత్వం నుంచి ప్రతి పేద వాడికి నాణ్యమైన వైద్యం అందాలని సీఎం జగన్మోహన్‌రెడ్డిని స్ఫూర్తిగా తీసుకుని అడ్డురోడ్డు ప్రజా వైద్యశాలలో ప్రతి ఆదివారం ఉచిత వైద్యం చేస్తున్నట్లు డాక్టర్ బంగారయ్య అన్నారు. అడ్డురోడ్డు ఆదివారం నిర్వహించిన ప్రజా వైద్యశాలలో సుమారు 220 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేసినట్లు చెప్పారు. పాయకరావుపేట నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో ఉన్న వారికి గడిచిన నాలుగేళ్లుగా సేవలు అందిస్తున్నానన్నారు.

పీఏసీఎస్‌ల పదవీ కాలం పొడిగింపు

నక్కపల్లి : ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల పదవీకాలాన్ని ప్రభుత్వం మరో ఆరు మాసాల పాటు పొడిగించింది. ఈ మేరకు సహకార శాఖ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి ఉత్తర్వులు జారీ చేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే పీఏసీఎస్‌ల పదవీ కాలం ముగిసింది. దీంతో ఎన్నికలు నిర్వహించకుండా త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేసింది. వీరిలో ఒకరిని పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా నియమించారు. తర్వాత వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కూడా ఇదే విధానాన్ని కొనసాగించింది. ప్రస్తుతం పీఏసీఎస్ పాలకవర్గాల పదవీకాలం గత నెల 30తో ముగిసింది. దీంతో వీరి పదవీ కాలాన్ని ప్రభుత్వం మరో ఆరు మాసాలు అంటే జూలై 30వ తేదీ వరకు పొడిగించింది. దీంతో పాయకరావుపేట నియోజకవర్గంలో శ్రీరాంపురం, పాయకరావుపేట, నామవరం, గొడిచర్ల, వేంపాడు, నక్కపల్లి, కొరుప్రోలు, పెనుగొల్లు, సర్వసిద్ధి పీఏసీఎస్‌లకు ప్రస్తుతం ఉన్న పర్సన్ ఇన్‌చార్జ్‌లు మరో ఆరు మాసాల పాటు పదవుల్లో కొనసాగుతారు.

షిరిడీ సాయి సన్నిధిలో ఉమ్మలాడ కళాకారుల కోలాటం



షిరిడీలో కోలాటం ప్రదర్శిస్తున్న ఉమ్మలాడ కళాకారులు

మునగపాక : మండలంలోని ఉమ్మలాడ కళాకారులు షిరిడీలో కోలాటం ప్రదర్శించారు. షిరిడీలో జరుగుతున్న సేవ కార్యక్రమానికి ఉమ్మలాడకు చెందిన దుర్గా భవానీ కోలాట బృందం సాయిబాబా ఆలయ ప్రాంగణంలో కోలాటం ప్రదర్శించారు. ఈ ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. తమకు సాయిబాబా సన్నిధిలో కోలాటం ప్రదర్శన రావడం అదృష్టంగా భావిస్తున్నామని కళాకారులు తెలిపారు.

మహా కుంభాభిషేకం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న క్షేత్రం నిర్వాహకులు

తుమ్మపాల : గ్రేటర్ విశాఖ విలీన గ్రామమైన సిరసపల్లి చింతామణి దత్త క్షేత్రంలో ఈనెల 9న జరిగే మహాకుంభాభిషేకం పోస్టర్‌ను క్షేత్రం నిర్వాహకులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ప్రజలందరూ హాజరు పాల్గొనాలని కోరారు.

పాత పెన్షన్ పథకం సాధనకు పోస్టుకార్డ్ ఉద్యమం

తుమ్మపాల : పాత పెన్షన్ పథకం సాధన కోసం పోస్టుకార్డ్ ఉద్యమం తలపెట్టినట్లు యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్ అన్నారు. కార్యాలయంలో ఆదివారం ఉద్యమ పోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడారు. ఈనెల 6 నుంచి 12వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. 13 నుంచి 29 వరకు గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు సీపీఎస్/జీపీఎస్ విధానాలు రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరుతు ఉద్యమం చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షులు గాయత్రి, కోశాధికారి జోగా రమేష్ పాల్గొన్నారు.

సంక్షేమాభివృద్ధి జగనన్నతోనే సాకారం



పెదగుమ్ములూరు పర్యటనలో కంబాల జోగులుతో పార్టీ శ్రేణులు

ఎస్.రాయవరం : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పాయకరావుపేట ఇన్‌చార్జ్ ,రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మండలంలో మూడవ రోజు పలు గ్రామాల్లో పర్యటించి కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. ముందుగా దార్లపూడి మేజర్ గ్రామ పంచాయతీలో పరిచయ కార్యక్రమం ప్రారంభించి చినగుమ్ములూరు, పెట్టుగోళ్లపల్లి, రామయ్యపట్నం , పెదగుమ్ములూరు, కొరుప్రోలు, సోమిదేవపల్లి, భీమవరం గ్రామాల్లో పర్యటించారు. తొలిసారిగా ఈ గ్రామాల్లో పర్యటించిన కంబాల జోగులకు కార్యకర్తలు ఘన స్వాగతం పలికి, హారతులతో ఆహ్వానం పలికారు.ఈ సందర్భంగా కంబాల జోగులు మాట్లాడుతూ 2019 లోనే సీఎం జగన్ మోహన్‌రెడ్డికి ఓటు ఓసేందుకు పేద బడుగు, బలహీన వర్గాలు నిర్ణయించుకున్నారని, ఇప్పుడు నాలుగున్నరేళ్లలో పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందజేశామని, ఇప్పుడు ప్రతి ఒక్కరిని ఓటు అడిగే హక్కు మనకే ఉందని అన్నారు. నిత్యం ప్రజా శ్రేయస్సుకోసమే సీఎం జగన్ మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని మరోమారు ఫ్యాను గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే మరింత అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు సొంతమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బొలిశెట్టి గోవిందరావు,జెడ్పీటీసి కాకర దేవి,వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, పార్టి జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు,మండల పార్టీ యూత్ అధ్యక్షులు నల్లపురాజు వెంకటరాజు, సర్పంచ్‌లు పాలపర్తి పాపారావు, కర్రి సత్యనారాయణ,గాడి అప్పలనరసింహ, ఎంపీటీసీలు పినపాలు అప్పయ్యమ్మ, గుడాల దేవుడమ్మ, వైఎస్సార్‌సీపి నాయకులు పోలిశెట్టి పెదఈశ్వరరావు, మల్లేసు, శ్రీనివాసరావు, పోలిశెట్టి సతీష్, బాబూరావు, కోన బాబూరావు, వియ్యపు వరహాలరావు, కనకారావు, చొప్పా రాజు,అర్జున్, సత్యనారాయణ, వెలగా శ్రీను, చింతలపాటి మణిరాజు, సీతారామరాజు, పుట్టా సుధాకర్, బిక్కిన శ్రీను, గరగా శ్రీను, నానిబాబు, పోచిన నరేష్, మధువర్మ, అద్దేపల్లి నూకునాయుడు, మాజీ జెడ్పీటీసి కశింకోట నీలేంద్రరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

మునగపాక : మునగపాక గౌరీ పరమేశ్వరుల ఉత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. నేల వేషాలతో పాటు తీన్‌మార్, పలు దేవతామూర్తుల అలంకరణలతో కూడిన ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. పలు కూడళ్లలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలను తిలకించేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు.

సమరసత సేవా ఫౌండేషన్‌కు మద్దతు ఇవ్వాలి

అచ్యుతాపురం : హిందూ ధర్మ ప్రచారం చేస్తున్న సమరసత సేవా ఫౌండేషన్‌కు మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని అనకాపల్లి జిల్లా మహిళా ప్రముఖ్ పోతు రంగారావు అన్నారు. అచ్యుతాపురం మండలంలోని ఎం.జగన్నాథపురం రామాలయంలో ఆదివారం సమరసతా సేవా ఫౌండేషన్ మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ ఏడు సంవత్సరాలుగా ఏపీలో ఎన్నో ధార్మిక ప్రచారాలు నిర్వహించామని తెలిపారు. కొల్లి అప్పారావు, బి.వి రమణ, గుడివాడ రమణ, చోడపల్లి సత్యం, బంటు రాము, వీర మహేశ్వరరావు, భీముని జోగినాయుడు పాల్గొన్నారు.

నోబుల్ సంస్థ సేవలు అమోఘం



నూకరాజును సత్కరిస్తున్న అతిథులు

తుమ్మపాల : నోబుల్ సంస్థ సేవలు అమోఘమని డాక్టర్ కె.విష్ణుమూర్తి అన్నారు. స్థానిక బీసీ వసతి గృహంలో నోబుల్ చారిటీస్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు జయలక్ష్మి, వ్యవస్థాపక కార్యదర్శి ఎస్. నూకరాజు కుమార్తె రత్నావళి జయంతి వేడుకలు జరిగాయి. సంస్థ సహకారంతో ఆయన వసతి గృహ విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ సేవలు మరువరానివి అన్నారు. 20 సంవత్సరాల నుంచి మహిళలకు, యువతకు సంస్థ అందిస్తున్న సేవలను వివరించారు. వసతి గృహ ఆయాలకు నూతన వస్త్రాలు అందజేశారు. ఏఎంఏఎల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేసి పదవీ విరమణ పొందిన నూకరాజును ఘనంగా సత్కరించారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.శ్రీనివాస్, దిశ పోలీస్ స్టేషన్ ఎస్ఐ శిరీష, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవాభావం



కేజీహెచ్‌లో మాణిక్యంకు పింఛను అందిస్తున్న వలంటీర్ అరుణ

మునగపాక : తోటాడకు చెందిన నున్న మాణిక్యం కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. దీంతో ఫిబ్రవరి నెలకు సంబంధించిన పింఛన్ రూ.3వేలను వలంటీర్ దొడ్డి అరుణ ఆదివారం కేజీహెచ్‌కు వెళ్లి మాణిక్యానికి అందజేసి అందరి మన్ననలు అందుకుంటున్నారు.



విశాఖలో చికిత్స పొందుతున్న వృద్ధాప్య పింఛను అందజేస్తున్న వలంటీర్ కుమారి

యలమంచిలి : వలంటీర్ సేవాభావంతో పనిచేయడం ద్వారా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయి. రేగుపాలెం గ్రామానికి చెందిన డప్పు కళాకారుడు దలియా సన్యాసి కొన్ని రోజులుగా అనారోగ్యంతో విశాఖపట్నం కింగ్‌జార్జి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే వృద్ధాప్య పింఛన్ల పంపిణీలో భాగంగా ఆదివారం వలంటీర్ మల్లిపాటి కుమారి కేజీహెచ్‌కి వెళ్లి దలియా సన్యాసికి పింఛను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్‌ల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పింఛను సకాలంలో అందడంతో ఎంతో ఆనందంగా ఉందని అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తనలాంటి వాళ్లకు సకాలంలో పింఛను అందుతుందంటే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చలవే అని ఆనందం వ్యక్తం చేశారు.

వైద్య సేవల్లో వెరీవెల్



వెల్‌నెస్ సెంటర్ ఆవరణలో ఔషధ మొక్కల పెంపకం



ఎత్తు కొలిచే హైట్ డిజిటల్ మీటర్



ఆధునీకీకరించిన కన్నూరుపాలెం ఆయుర్వేదిక్ వెల్‌నెస్ సెంటర్

కశింకోట : సుమారు నాలుగు దశాబ్దాల క్రితం మారుమూల ప్రాంతమైన కన్నూరుపాలెంలో ప్రభుత్వం ఆయుర్వేదిక్ డిస్పెన్సరీని ఏర్పాటు చేసింది. అయితే ఈ వైద్యం పట్ల అవగాహన లేక ప్రజలు పెద్దగా ఈ సేవలు ఉపయోగించుకునేవారు కాదు. వైద్యులు, సిబ్బంది కూడా అరకొరగానే ఉండేవారు. దీనికి నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరడంతో 2016లో రూ.7 లక్షలతో కొత్తగా భవనాన్ని నిర్మించారు. దానిలో సరైన సదుపాయాలు లేక సేవలు కూడా అంతంత మాత్రంగానే ఉండేవి. ఈ నేపథ్యంలో ఆయుష్మాన్ భారత్ పేరిట వీటిని పటిష్టం చేసి భారతీయ వైద్యమైన ఆయుర్వేదం పట్ల ప్రజలకు విస్తృతంగా అవగాహన కలిగించి సేవలందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రూ.5 లక్షలు సమకూర్చి డిస్పెన్సరీని వెల్‌నెస్ సెంటర్‌గా మార్పు చేసి నూతన హంగులతో ఇటీవల భవనాన్ని ఆధునికీకరించారు. ఆయుర్వేదిక్ ఫార్మసీ రాష్ట్ర విభజనతో తెలంగాణకు వెళ్లిపోవడం వల్ల కేరళ ఔషధాలయంతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుని అక్కడి నుంచి ఆయుర్వేదిక్ మందులు, తైలాలు వగైరా కొనుగోలు చేస్తోంది. అవి ఇక్కడి వెల్‌నెస్ కేంద్రానికి కూడా చేరాయి. దాదాపు అన్ని రకాల వ్యాధులకు సరిపడిన మందులు అందుబాటులోకి వచ్చాయి. ప్రధానంగా గర్భస్థ వ్యాధులు, నరాల బలహీనత, వ్యాధి నిరోధక శక్తి పెంచడానికి, ఎసిడిటీ, అజీర్ణ సమస్యలు, సీజనల్ వ్యాధులు తదితర వాటికి మందులు అందుబాటులో ఉన్నాయి. వైద్యాధికారి ఆయుర్వేదిక్ వైద్యం పట్ల అపోహలు పోగొట్టి అవగాహన కలిగిస్తూ స్కూళ్లలో విద్యార్థులు, గ్రామాల్లో ప్రజల కోసం శిబిరాలు నిర్వహించి ఉచిత మందులు అందజేస్తున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో కూడా ప్రత్యేకంగా ఆయుర్వేదిక్ శిబిరాలను నిర్వహించారు. మండల గ్రామాల్లోనే కాకుండా నర్సీపట్నం ప్రాంతంలో కూడా ఈ కేంద్రం ద్వారా అవసరమైనప్పుడు శిబిరాలు నిర్వహించి సేవలను విస్తృతంగా అందిస్తున్నారు. ప్రస్తుతం సెంటర్‌కు రోగులు కూడా బాగానే వచ్చి సేవలు పొందుతున్నారు. అలాగే యోగా, ధ్యానం పట్ల అవగాహన కలిగిస్తూ శిక్షణ ఇవ్వడానికి ఇద్దరు యోగా టీచర్లను కూడా నియమించారు. వారు స్కూళ్లలో విద్యార్థులు, స్థానికంగా ప్రజలకు శిక్షణ ఇస్తున్నారు.

అందుబాటులో పరికరాలు..

మోకాళ్ల నొప్పుల నివారణకు చికిత్స కోసం ఇన్‌ఫ్రారెడ్ మెషిన్, పల్స్ తనిఖీకి పల్స్ ఆక్సీ మీటర్, జ్వరం తీవ్రత తెలుసుకోవడానికి థర్మా మీటర్, మనిషి ఎత్తు కొలవడానికి హైట్ డిజిటల్ మీటర్, నీటిని శుభ్రపరిచే వాటర్ ప్యూరిఫికేషన్ యంత్రం తదితర పరికరాలను సమకూర్చారు. త్వరలో దీన్ని ఆయుష్మాన్ భారత్ తరఫున సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా రూపొందించడానికి, పంచకర్మల చికిత్స అందుబాటులో తేవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందుకు అవసరమైన గదులు అందుబాటులో ఉన్నాయి. ఇవి అందుబాటులోకి వస్తే దీని సేవలు మరింత విస్తరించనున్నాయి. వెల్‌నెస్ సెంటర్‌ను అభివృద్ధి చేయడంతో పాటు సేవలు మెరుగుపర్చడం పట్ల స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా పడమటమ్మ తీర్థ మహోత్సవం

కశింకోట : పడమటమ్మ తీర్థ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్థానిక కస్పావీధి ప్రాంతంలోని పొలాల్లో వెలసిన ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని ఆభరణాలు, నూతన వస్త్రాలు, కరెన్సీ నోట్ల మాల, పూలదండలతో అందంగా అలంకరించారు. ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారిని కశింకోట గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి ఎక్కువ మంది భక్తులు తరలి వచ్చి దర్శించుకున్నారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, మాజీ ఎమ్మెల్యేలు పీలా గోవిందసత్యనారాయణ, వంగలపూడి అనిత తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు దుశ్శాలువ కప్పి జ్ఞాపికలతో సత్కరించారు. తీర్థం సందర్భంగా భారీ అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం తీర్థ మహోత్సవం జరిగింది. తిను బండారాలు, ఆట వస్తువులు, పండ్లు తదితర విక్రయాలు జోరుగా సాగాయి. బాలికలు కోలాటాలు నిర్వహించారు.

ఉత్సాహభరితంగా ఎడ్ల బళ్ల పోటీలు..

తీర్థం సందర్భంగా ఉత్సాహభరితంగా జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీలు జరిగాయి. పోటీలో విజేత ఎడ్లకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థి బహుమతులు అందజేశారు. సుమారు 16 బళ్లు పోటీలో పాల్గొన్నాయి.

క్యాన్సర్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి



రోగులకు అవగాహన కల్పిస్తున్న వైద్యుడు నాయుడు

అనకాపల్లి : క్యాన్సర్ మహమ్మారి పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులు డీడీ నాయుడు అన్నారు. స్థానిక నర్సింగ్‌హోమ్‌లో ఆదివారం క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ క్యాన్సర్ డేను పురస్కరించుకుని వ్యాధి నివారణపై రోగులకు అవగాహన అవగాహన కల్పించారు. వ్యాధిని తొలిదశలో గుర్తించి వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఇటీవల కాలంలో పెద్ద సంఖ్యలో క్యాన్సర్ మరణాలు నమోదవుతున్నాయన్నారు. క్లబ్ అధ్యక్షుడు భీశెట్టి రామకృష్ణ మాట్లాడుతూ ఈ వ్యాధి నివారణకు క్లబ్ సభ్యులందరూ కలిసికట్టుగా రావాలని ఆయన పిలుపునిచ్చారు. స్త్రీలు గర్భాసయ, బ్రెస్ట్ క్యాన్సర్లకు లోనవుతున్నారన్నారు. వ్యాధి గ్రస్తులను గుర్తించడంతో పాటు వారికి అగనంపూడి హోమీ బాబా, విశాఖ మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రులకు తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి రాపేటి నారాయణరావు, క్లబ్ సభ్యులు నల్లల దేవుళ్లు పాల్గొన్నారు.

నర్సింహమూర్తికి ఎమ్మెల్యేల పరామర్శ



నర్సింహమూర్తిని పరామర్శించిన ఎమ్మెల్యే బాబూరావు



నర్సింహమూర్తిని పరామర్శిస్తున్న కంబాల జోగులు

నక్కపల్లి /ఎస్.రాయవరం : రోడ్డు ప్రమాదానికి గురై నెలరోజుల పాటు విశాఖ ఆస్పత్రిలో చికిత్స పొంది డిశ్చార్జ్ అయి ఇంటి వచ్చిన నక్కపల్లి మండల పార్టీ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తిని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పరామర్శించారు. గత నెల 2వ తేదీన అడ్డురోడ్డు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నర్సింహమూర్తి తీవ్రంగా గాయపడ్డారు. పక్కటెముకలు విరిగిపోవడంతో పాటు, తలకు, ఛాతీకి తీవ్రమైన గాయాలయ్యాయి. ప్రాణాపాయ స్థితికి చేరుకున్న ఆయనకు ఆరిలోవలోని ప్రైవేటు ఆస్పత్రిలో నెలరోజుల పాటు అత్యవసర చికిత్స అందించారు. ఇతని వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.15 లక్షలు ఆర్థిక సాయం విడుదల చేశారు. చికిత్స పూర్తయిన తరువాత ఆయన పూర్తిగా కోలుకోవడంతో శనివారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఇంటి వద్ద విశ్రాంతి పొందుతున్న నర్సింహమూర్తిని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, సమన్వయకర్త కంబాల జోగులు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాలరామారావు, జేసీఎస్ జిల్లా కన్వీనర్ సూరాకాసుల గోవిందు, పాయకరావుపేట ఎంపీపీ ఇసరపు పార్వతి తాతారావు, సర్పంచ్‌లు అల్లు రమణ, నాగ అప్పలరాజు, వియ్యపు శ్రీను, మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జి, పలువురు నాయకులు పరామర్శించారు.

భక్తిశ్రద్ధలతో ఆంజనేయ తీర్థం



రామారాయుడుపాలెంలో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు



తమలపాకులు, పూలతో ప్రత్యేక అలంకరణలో వాయుపుత్రుడు

యలమంచిలి రూరల్ : శ్రీరామ భక్తుడు, వాయు పుత్రుడు హనుమంతుని నామస్మరణతో రామారాయుడుపాలెం గ్రామం ఆంజనేయస్వామి ఆలయ పరిసరాలు ఆదివారం మార్మోగాయి. ఇక్కడ తీర్థం సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయంలో గ్రామ పెద్ద సుంకర వెంకట గిరి దంపతులతో పాటు పలువురు భక్తులు స్వామివారికి భక్తిశ్రద్ధలతో పంచామృతాభిషేకం, సింధూరార్చన చేశారు. పలువురి భక్తుల గోత్రనామాలతో వేద పండితుడు ఆనివెళ్ల శ్రీనివాసశర్మ, సహాయకుడు పరసా బలరాంలు విశేష పూజలు చేయించారు. స్వామిని ప్రత్యేకంగా తయారు చేసిన పూల దండలు, తమలపాకుల దండలతో అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆంజనేయస్వామిని దర్శించుకుని కొబ్బరికాయలు, అరటి పండ్లు నైవేద్యంగా పెట్టి నిమ్మకాయలను స్వామి పాదాల వద్ద ఉంచి పూజలు చేశారు. ఈ సందర్భంగా సుమారు రెండు వేల మంది భక్తులకు అన్నసంతర్పణ చేశారు. సాయంత్రం బుర్రకథ ప్రదర్శన అలరించింది. తీర్థాన్ని వార్డు కౌన్సిలర్ మణేశ్వర్రావు, అంకిరెడ్డి నర్సింగరావు, అంకిరెడ్డి కృష్ణారావు, రమేష్ పర్యవేక్షించారు.

రాజయ్యపేటలో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం



రాజయ్యపేటలో వైద్యశిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న జెడ్పీటీసీ కాసులమ్మ

నక్కపల్లి : ముసలమ్మ చారిటబుల్ ట్రస్ట్ తరఫున నిర్వహిస్తున్న వైద్య శిబిరాలు, వైద్యసేవలు ప్రశంసనీయమని జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ అన్నారు. రాజయ్యపేటలో ఆదివారం నిర్వహించిన ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామానికి చెందిన బంగారుచిట్టి తన తల్లి ముసలమ్మ పేరున చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి కొద్ది రోజులుగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ఆదివారం క్యాన్సర్‌కు సంబంధించిన శిబిరం మెడికవర్ ఆస్పత్రి వైద్యులతో ఏర్పాటు చేశారన్నారు. గ్రామంలో వందలాది మంది ఈ శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నారన్నారు. తాను ఏర్పాటు చేసిన చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వైద్య సేవలు అందించడం, పేదలకు వస్త్రాలు పంపిణీ చేయడం వంటి సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్న బంగారు చిట్టిని ఆమె అభినందించారు. ఈ శిబిరంలో ఆమె కూడా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పిక్కి సత్తియ్య, గంగరాజు, పిక్కి కోదండరావు, వాసపల్లి నూకరాజు, తాతీలు పాల్గొన్నారు.

సాధన సంకల్ప సభను విజయవంతం చేయండి



సాధన సంకల్ప సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మునగపాక : ఈ నెల 10న పాయకరావుపేటలో జరగనున్న సాధన సంకల్పసభను జయప్రదం చేయాలని జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు రేబాక మదుబాబు కోరారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం మునగపాక దళితవాడలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఇండియన్ మిషన్ ఆధ్వర్యంలో మహా సంకల్ప సభ మధ్యాహ్నం 3 గంటలకు జరుగుతుందన్నారు. వెయ్యి జనాభా కలిగిన ప్రతి దళితవాడ ప్రత్యేక పంచాయతీ కావాలని, అలాగే రాజ్యాధికార దిశగా అడుగులు వేసేందుకు ఈ సంకల్ప సభలో చర్చిస్తారన్నారు. ప్రభుత్వానికి ఒక నివేదిక ఇచ్చేందుకు వీలుగా ప్రతి ఒక్కరూ సభకు హాజరు కావాలన్నారు. అంబేద్కర్ ఇండియన్ మిషన్ జోనల్ నాయకులు మామిడి శ్రీనివాసరావు, ఐటీ వింగ్ నాయకులు జల్లి రాజశేఖర్, రెళ్ల నారాయణరావు, మండల అధ్యక్షులు బీలా శివగణేష్, దళితనాయకులు మహేష్, సీతారామ్, మురళి, నాగరాజు, పండు, శివకుమార్, శ్రీను కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఐక్యతతోనే అభివృద్ధి



దంపతులను సత్కరిస్తున్న సంఘ సభ్యులు

అనకాపల్లి : చౌడేశ్వరి దేవాంగ సంక్షేమ సంఘ సభ్యులందరూ ఐక్యంగా మెలగాలని జిల్లా సంఘం అధ్యక్షుడు ఉప్పు సత్యనారాయణ అన్నారు. మండలంలో సత్యనారాయణపురం సత్యదేవుని కొండ వద్ద ఆదివారం సంఘ కుటుంబ సభ్యుల ఆత్మీయ కలయికలో ఆయన మాట్లాడారు. పోరాటాల ద్వారానే బీసీలు రాయితీలు పొందవచ్చన్నారు. అంతకు ముందు 50 ఏళ్ల వివాహ వార్షికోత్సవం జరుపుకున్న మావూరి వీరభద్రరావు, బాసిన గురుమూర్తి, రెడ్డి అప్పారావు జంటలను ఘనంగా సత్కరించారు. మధ్యాహ్నం 200 మంది కుటుంబాలకు చెందిన వారు ఆహ్లాదకరమైన వాతావరణంలో భోజనాలు చేశారు. సంఘం గౌరవాధ్యక్షుడు ముప్పన సుబ్రహ్మణ్యం, కార్యదర్శి కాలెపు సదాశివరావు, స్థానిక సంఘ అధ్యక్షుడు ఉజ్జి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు ముప్పన లింగేశ్వరరావు, కార్యదర్శి బల్లా నాగభూషణం, కోశాధికారి ముప్పన నాగేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.